# ఆడబోయిన తీర్థం!

రచన: గుడిశేవ వెంకటేశ్వరరావు




గోడ గడియారం టంగ్ - టంగ్ మంటూ మూడుసార్లు మ్రోగింది, మగత నిద్రలో పగటి కలలు కంటున్న రాజమ్మగారు వులిక్కిపడి లేచింది. కళ్లు నులుముకొని, పమిటకొంగు సవరించుకొని గబగబా ప్రక్కగదిలోకి నడచింది. రామయ్యగారు గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. రాజమ్మగారికి కోపం వచ్చింది. రిటైర్ అయినవద్దనుంచీ తన భర్త మరీ సోమరిలా తయారయ్యారు. సుష్టుగా భోంచేసి మత్తుగా నిద్రపోవటం మినహాయించి మరోయావే లేదు. ఆలుబిడ్డ లేమయినా ఆయన కనవసరం. సంసారవిషయాలు చిల్లరవిషయాలుగా తోసివేస్తారు. పోనీ ఏ బజారుపనులో తనప్పగించిందా అంటే ముమ్మాటికీ లేదు... ఈ రోజు ఎలాంటి వ్యవహారం చక్కబెట్టవలసుంది...! తనను కాదన్నట్లుగా గుర్రుపెట్టి నిద్రపోతున్నారు... రాజమ్మగారికి కోపం ఎక్కువయింది.

"ఏమండీ...! ఏమండోయ్...!!"

"................................"

"మిమ్మల్నేనండీ...?"

"ఊఁ..."

"మరీ అంత మత్తునిద్రయితే ఎలాగండీ! లేచి చూడండి టయిమెంత అయిందో!"

"ఏమిటే...! మిట్టమధ్యాహ్నం యిప్పుడేం వచ్చిపడింది...?" రామయ్యగారు విసుగ్గా లేచి కూర్చున్నారు.

"అయ్యో నారాత... ఇప్పుడు మిట్టమధ్యాహ్నమటండీ! ఎప్పుడనగానో గడియారం మూడుకొట్టింది. నాలుగున్నర బండికేమో వారు రానే వస్తున్నారాయె. ఇంకెప్పుడండీ! మీరు స్టేషనుకు పోయేది!"

"సరి...సరే......బాగానే వుందిలే! ఎప్పుడో నాలుగున్నరకొచ్చే బండికి యిప్పటినుంచే పడిగాపులు పడి చావమంటావు...అంతేనా నువ్వుచెప్పేది? అందులో మన గడియారాలు ఏ అరుగంటలో అయితేనేగావి రైల్వేవాళ్ల గడియారాలు నాలుగో ... నాలుగున్నరో చూపించవు.." పండిపోయిన మీసాన్ని మారు దువ్వుకున్నారు.

"ఏమో బాబూ! మీకు నేను చెప్పలేను. అరుగంటలకే వెళతారో లేక పదిగంటలకే పోతారో మీయిష్టం." రాజమ్మ వుక్రోషంతో చర్రున వెనుదిరిగింది.

"ఆగు రాజీ...! పోనీ నీ యిష్టప్రకారమే వెళతానుగాని ఒక్క సలహా చెప్పు...!"

రాజమ్మ కోపం హారతికర్పూరంలా హరించుకపోయింది. తన భర్త మనస్తత్వమే అలాంటిది. మూడుపుష్కరాల తమ దాంపత్య జీవితంలో భర్త మనోభావాన్ని ఆమె కాచి వడపోసింది. అందుకే మారుపలక్కుండా అడుగులో అడుగేసుకుంటూ వచ్చి నిలబడింది.

"అయ్యో! ఖర్మ...మీకు నేను సలహాలు చెప్పేదాన్నినూ మీరు వినేవారూనా...!" ముక్కుమీద వేలేసుకొంది రాజమ్మ.

"అలాగనకు రాజీ! మహారాజుకు మంత్రిపుంగవుడెలా సలహాలుచెబుతాడో భర్తకు భార్యకూడా అదేవిధంగా సమయమొచ్చినపుడు సలహాలు చెప్పాలని నొక్కి వక్కాణించారు మన పూర్వులు..."

"సరేలెండి ... అసలు విషయం చెప్పండి"

"అదికాదు రాజీ! ఆ పెద్దమనిషి వూరూ, పేరూ, ముక్కూ, ముఖమూ కూడా నాకు తెలియదయ్యె. తను వెంటబెట్టుకొస్తానన్న వెంకయ్యేమో 'నాకు వీలుపడనందున ఆ పెద్దమనిషి ఒక్కరినె మీ అడ్రసిచ్చి పంపుచున్నా' నని చివరి నిమిషంలో వైరిచ్చాడయ్యె...! ఇప్పుడెలాగు చచ్చేది! నువ్వేచెప్పు!!"

"అలాగనుకుంటే ఎలాగండీ! స్టేషనుకు పోకుండా యింట్లోకూర్చుని ఎదురుచూడటం ఏమంత మర్యాదగా వుంటుంది చెప్పండి? వెంకయ్యగారు మీ గుర్తులన్నీ ఆ పెద్దమనిషికి చెప్పే వుంటారు. అందుకని మీరెళ్లి ప్లాట్ఫారమ్ మీదనుంచి జనం బయటకు వచ్చే గేటువద్ద నుంచున్నారంటే వారే మిమ్మల్ని గుర్తుపట్టవచ్చు. అలా జరక్కపోతే అంతా వెళ్లిపోయేవరకూ వుండి

మీరు సరాసరి యింటికొచ్చేయండి! 'స్టేషనులో మిమ్మల్ని గుర్తుపట్టలేక తిరిగి వచ్చినందులకు క్షమించాలని' క్షమాపణయినా చెప్పుకోవచ్చు... మీ మర్యాదా వారికి తెలుస్తుంది..."

"ఎంత అమోఘమయిన సలహా యిచ్చావు రాజీ!... తప్పకుండా అలాగే చేస్తాను... ఏదీ! ఆ కోటూ, గొడుగూ యిలా అందుకో ఓ కప్పు కాఫీకూడా."



రాజమ్మ అన్నీ అమర్చి భర్తను ప్రయాణంచేయించి గుమ్మంవరకు సాగనంపి వెనుదిరిగింది.

"రాజీ...! ఏంటా... మరచిపోయినట్టుంది అని ఆలోచిస్తున్నాను... ఏదీ ఒక పుగాక్కాడందుకో..." వెనుదిరిగి రెండడుగులు వేసాడు రామయ్య.

"అయ్యో! నారాత... ప్రయాణమై వెనక్కి తిరగొచ్చుటండీ! నే తెచ్చిస్తాను మీ రక్కడే వుండండి..."

"అలాగేలే... అచేత్తోనే కాస్త అగ్గి పెట్టికూడా..."

తృప్తిగా చుట్ట ముట్టించుకొని గుప్-గుప్‌న రైలుబండిలా పొగ వదుల్తూ బయల్దేరారు రామయ్యగారు. భార్య ఆయన్ను చూస్తూ కడపలో నిలబడింది.

స్వర్ణకుమారి గదిలో మంచంమీద పడుకొని డిటెక్టివ్ నవల చదువుకొంటోంది అడుగుల చప్పుడువిని తలెత్తి చూచింది. ఎదురుగా తల్లి ప్రత్యక్షమయింది.

"అయ్యో! నారాత. యింకా నువ్వు నవల్లు చదువుతూనే వున్నావుటే...!"

స్వర్ణ మారు మాట్లాడలేదు.

"మాట్లాడవేమే ఒకప్రక్క పెండ్లివారొచ్చే టయిమయిపోతావుందే! నీకు మాత్రం చీమకుట్టినట్లయినా లేదాయె యెలాగే యింకా చచ్చేది! మీతో వేగలేక నా ప్రాణం పోయేటట్టుంది ముందు..."

"ఎందుకే అమ్మా! అంత గాభరా పడిపోతావూ!! పట్టుమని పదినిమిషాలు చాలు నేను టాయిలెట్ అయ్యేందుకు. మరో పావుగంటకల్లా యీ నవలకూడా పూర్తయిపోతుంది. మాంచి సస్పెన్సులో వుండిలే...కథ"

"ఏమోనమ్మ నీ కెవరు చెప్పగలరు! అరవై యేళ్ళొచ్చిన ఆయనకూ, పెండ్లికానిపిల్లకూ కూడా నామాటంటే నిర్లక్ష్యమేనాయె ..ఏదో ఆ దేముడు తిన్నగా చూచి ఈ సంబంధమైనా కాస్త కలిసిరావాలని నేను పదేపదే మొక్కుకుంటూ వుంటే నిండుకుండలాగ తొణక్కుండా, బెణక్కుండా నువ్వుంటివి."

"అబ్బబ్బ నన్ను డిస్టర్బ్ చెయ్యకే అమ్మా!" స్వర్ణ విసుక్కొంది.

"సరేలేవే! నీ కంత విసుగెందుకు పోతున్నాలే! ఎవరికర్మ కెవరుకర్తలు" రాజమ్మగారు గబగబా నడచి గదిలోంచి బయటపడింది.

స్వర్ణ మెల్లగా నవ్వుకొని మళ్ళా పుస్తకం చదవటం ప్రారంభించింది. కాని ఈసారి మనస్సు దానిమీద లగ్నం కాలేదు. తన తలితండ్రులు తన మూలాన అనుభవిస్తున్న మనోవేదనను ఆమె అర్థం చేసుకోగలదు. కాని ప్రయోజనమేమిటి? అమ్మ తాపత్రయమే గాని తన్నెవరు చేసుకుంటారు! ఎలాగో చేసుకొన్నా తనెంతకాలం సుఖపడగలుగుతుంది! ఏ క్షణానైనా భర్త చీదరించుకొని గెంటేయవచ్చు. అందుకే అసలు



పెండ్లిమాటే తలపెట్టక శాంతంగా తలిదండ్రుల సాన్నిధ్యంలో బ్రతకడం నూటికి నూరుపాళ్లూ శ్రేయస్కరమని తనేనాడో నిర్ణయించుకొంది. రేపు వొదిన్లొచ్చి మొట్టుతారన్న భయంకూడా లేదు. తనే తన తలిదండ్రుల కేకైక సంతానం. అంత ఆడంబరంగా కాకపోయినా మామూలుగా బ్రతికేందుకు తండ్రి వెనుకేసిన సొమ్ము సరిపోతుంది. మరింకేం కావాలి!

తన నిశ్చయాన్ని మరోసారి దృఢం చేసుకొని తిరిగి నవలాపఠనంలో నిమగ్నురాలయింది స్వర్ణ.

రామయ్యగారు తాపీగానడచి స్టేషను చేరుకొనేసరికి అప్పటికప్పుడే మద్రాసు మెయిలొచ్చి ఆగింది. ప్లాట్‌ఫారమ్ గడియారం నాలుగూ నలభై చూపెట్టింది. బెలబెలా జనమంతా తరలిపోతున్నారు. 'బండి కరెక్టు సమయానికే ఒచ్చిందే' అనుకొంటూ రామయ్యగారు చురుగ్గా నడవసాగారు. అప్పటికప్పుడే జనం పల్చబడిపోయారు. ఒక నిమిషంసేపు నిలబడి ప్లాట్‌ఫారంవైపు పరికించి చూశారు. కాబోయే వియ్యంకుడి జాడలేమీ కన్పించలేదు. నిరాశగా వెనుదిరిగాడు. బహుశా యింటికిపోయి వుండొచ్చన్న వుద్దేశ్యంతో చకచకా నడవసాగారు.

"రామయ్యగారూ...!" వెనుకనుంచి విన్పించిన ఆ పిలుపుతో వారి కాళ్ళకు బ్రేకుపడింది.

చిన్ననాటి స్నేహితుడు జగన్నాథం నవ్వుతూ దగ్గరకొచ్చాడు.

జగన్నాథమూ, రామయ్యగారూ చిన్నప్పుడు హైస్కూల్లో కలిసి చదివినవారు. అప్పుడే యిరువురూ స్నేహితులయ్యారు. రామయ్యగారు స్కూలు ఫైనలు పాసై తాలూకాఫీసులో గుమాస్తాగా చేరిపోయారు. జగన్నాథం తప్పటంవలన చదువుకు స్వస్తిచెప్పి ఉన్న వ్యవసాయాన్ని చూచుకొంటూ వ్విగ్రామంలోనే స్థిరపడిపోయాడు. అలా సధిచేత చెరోదిక్కుకూ విసరివేయబడ్డ స్నేహితు లిరువురూ రెండుమూడుసార్లు మాత్రం ఇలాగే రైల్వేస్టేషనులోనో, కాఫీ హొటలులోనో, సినిమాహాల్లోనో కలుసుకొని కాసేపు లోకాభిరామాయణం ముచ్చటించుకొని, ఆ తరువాత సంసారవిషయాలూ, ఆఫీసుసంగతులూ కూడా ఒకరి కొకరు చెప్పుకొని విడిపోవటం జరిగింది.

మిత్రు లిరువురూ ప్రక్కనున్న సిమెంటు బెంచిమీద ఆసీనులయ్యారు.

"ఏమి జగన్నాథం! విశేషాలేమిటి! మనం కలిసి ఆరేడేళ్ళయిందికదూ!!"

"కాకేమండీ! క్రిందటి పర్యాయం కృష్ణపుష్కరాల్లో కలిశాము"

"అవునవును ... నాకూ జ్ఞాపకమొచ్చింది..."

"రిటైరయ్యారా !"

'అవునోయ్...దగ్గరదగ్గరగా సంవత్సరం కావొస్తోంది..."

"ఏమిటేమిటి! సంవత్సర మయిందన్నమాట. కాళీగానే వుంటున్నారా !"

"ఆ..."

"మీకేమిలెండి కష్టపడ్డారు ప్రస్తుతం హాయిగా జీవిస్తున్నారు-ఏ బాదరబందీ లేకుండా!"

"నువ్వట్లు నాకేబాదర బందీ లేక పోలేదు జగన్నాథం ... ఉన్నదేమో ఒక్కగా నొక్కకూతురు..." రామయ్యగారెందుకో ఆగిపొయ్యారు.

"ఎంత అదృష్టవంతులండీ! ఒక్క కూతురు...నాకు అరుగురు కొడుకులూ నలుగురు కూతుళ్ళూను... నాకున్న పదెకరాల భూమి వాళ్ల చదువులకే సరిపోలేదు. ఇంతవరకు పెద్దవాడి కొక్కడికిమాత్రమే పెళ్ళయింది. ఇద్దరాడపిల్లలూ, ఒక మగపిల్లాడూ పెళ్లికి సిద్ధంగా వున్నారు చేతిలో చిల్లిగవ్వ లేదు పెద్దోడుచూస్తే వాడి పబ్బంగడుపుకుపోయాడేగాని ప్రస్తుతం ఏ గాని యింటికి పంపడు. రెండోవాడుచూస్తె వుద్యోగం సద్యోగంలేక యింటిదగ్గరుండిపోయాడు..."

"నాగోడుకూడా కాస్త వినుమరీ...! జగన్నాథం ఏదో అంతరంగిక మిత్రుడి పని చెబుతున్నాను. మనస్సులో వుంచుకోవాలి సుమా!!"

"అన్నన్నా! ఎంతమాటెంతమాట! జగన్నాథం చెవిలోపడ్డమాట మళ్లా బయటికి పోవటమా! గరళకంఠుడు హాలాహలాన్ని దిగమ్రింగినట్లేనుమా!"

"నువ్వలాంటివాడవు కావని నాకు తెలుసనుకో... అసలువిషయ మేమిటంటే. అమ్మాయి కాస్త నలుపు..."

"ఆ దానికేముంది లెండి. సాక్షాత్తు త్రిలోకాధినాథుడైన ఆ విష్ణుమూర్తే నలుపు. అసలు నన్నడిగితే నలుపులోనే వుందంటాను అందం..."

"అవుననుకో...దానికితోడు మొగాన స్ఫోటకపు మచ్చలు...జగన్నాథం!"

"మరింకేమండీ! నల్లని వినీలాకాశంలో నక్షత్రాలు మెరుస్తుంటే ఎలా వుంటుందో మీకు చెప్పాలా!

"చాలా బాగాచెప్పావు జగన్నాథం. అచ్చంగా అమ్మాయిమొగం చూస్తుంటే అలాగే వుంటుంది ... కాని...మరొకటోయ్! పదేళ్ళ వయస్సులో తోటిపిల్లలతో ఆడుకొంటూంటె పొరపాటున ఒకమ్మాయి వ్రేలు మనమ్మాయికంట్లో గ్రుచ్చుకొంది... వెంటనే తగిన చికిత్స చేయించామనుకో ... అయినా కంట్లో తెల్లగా పువ్వేసింది."

"ఊహూ..." అని వూరుకున్నాడు జగన్నాథం, దాన్నెలా వ్యాఖ్యానించాలో అర్థంకాక.

"ఒకసారి వాళ్ల తాతగారూరు పోయేందుకు బండిలో ప్రయాణం చేయవలసి వచ్చిందీ కొత్తగిత్తలేమో...బెదిరి బండిని రాళ్లగుట్టెంకించి బోల్తాకొట్టాయి. అప్పుడే కాస్త తొంటి ఎముక తొలగిపోయింది, అమ్మాయికి చాలారోజులు తోమించి కట్టుకట్టించాం. అయినా... యిప్పటికీ కాలు కాస్త పట్టేస్తూనే వుంటుంది."

"అలాగా..."

"మరొక్కటుంటె ఒక్కటుంది... ఆరేళ్ళ వయస్సులో అమ్మాయికోసారి డబుల్ టయిఫాయిడ్ వచ్చింది. భగవదనుగ్రహంవల్ల ఆ గండం గడిచి గట్టెక్కింది కాని...అప్పట్నుంచి నెలకు ఒకటిరెండు ఫర్యాయాలు ఫిట్సు వస్తాయి. ఎందరెందరో గొప్ప గొప్ప డాక్టర్లకు చూపించాము. కాని ప్రయోజనం శూన్యమయింది. ఇంక అది నయమవుతుందన్న ఆశకూడా మిగల్లేదు..." రామయ్యగారు యిక మాట్లాడలేదు.

జగన్నాథం ఏమి మాట్లాడాలో తెలియక మానేశాడు. మౌనంగా ప్లాట్ఫారమ్మీద పచార్లు చేస్తున్న జనసమూహంవంక చూస్తున్నాడు.

"అయ్యయ్యో! ఎంతపని జరిగింది జగన్నాథం...!"

జగన్నాథం వులిక్కిపడ్డాడు.

"ఏమైందండీ..."

"నీతో మాటల్లోపడి అసలువిషయం మరచిపొయ్యాను. ఈ రోజు మా యింటికి పెళ్లిచూపులకు వస్తున్నారు. నేను మరి వేగంగా పోవాలి. నీవుకూడా యీపూటకి కాస్త మా యింటికొస్తె సంతోషిస్తాను."

"మీ యింటి పెళ్లిచూపులకా...!!!" జగన్నాథం ఆశ్చర్యపోయాడు.

"అవునవును...ఎందుకంత ఆశ్చర్యపోతావు!"

జగన్నాథం గతుక్కుమన్నాడు.

"అబ్బే! ఆశ్చర్యం దేనికి! ఏవూరునుంచి?"

"కవలగుంటనుంచి"

జగన్నాథం మరోషాక్ తిన్నాడు... వెంకయ్య తనకిచ్చిన అడ్రసు ముమ్మాటికీ ఈ రామయ్యగారిదేనని దృఢంచేసుకొన్నాడు. ఇప్పుడేమిచేయటమా అన్న సమస్య ఎదురైంది... ఒక్కక్షణం ఆలోచించి...

"క్షమించాలి రామయ్యగారూ! మీ యింటికి పెండ్లి చూపులకు రావలసిన పెద్దమనిషిది మావూరే. ఆయనకొడుకుకేదో హఠాత్తుగా సుస్తీచేస్తె ఆగిపొయ్యాడు. నేను వేరే పనిమీద ఈవూరు వస్తున్నానని తెలిసి, మీ అడ్రసు రాసిచ్చి విషయం తెలియజేయమని మరీ కోరాడు. రామయ్యగారంటే మరెవరో అనుకున్నాను. ఇదిగో చూడండి... ఈ అడ్రసు మీదే కదూ...!"

"అవును...నాదే...!" అన్నాడు రామయ్యగారు చీటీ అందుకొని చదువుతూ.

"సరే యికేం! ఆడబోయిన తీర్థం ఎదురైన దన్నట్లు మీరు నాకు యిక్కడే దొరికారు ... కాస్త అర్జెంటు పనుంది. మరి సెలవు..." జగన్నాథం గబగబా బయటకు నడచాడు.

రామయ్యగారు భారంగా అడుగులేసుకొంటూ యింటికి బయలుదేరాడు.

బుక్కింగ్ ఆఫీసు ప్రక్కన తప్పించుకొన్న జగన్నాథం ప్లాట్ఫారంమీద తన వూరుకు రడీగావున్న బండెక్కి కూర్చున్నాడు.

★


## కస్తూరి మాత్రలు

జలుబు, సాధారణ శీతలముచేత దగ్గులు, జ్వరము, గొంతులో కరకరమని యుండుట తల భారము మొదలగువాటిని పోగొట్టును. ఈమాత్రలు బిడ్డలుమొదలు వృద్ధులువరకు ఎంత వయస్సుండినను వాడుకోవచ్చును.

25 మాత్రలు గల బుడ్డి 1-కి రు. 1=00
తపాలా చార్జి రు. 1=12

ధనలక్ష్మి అండ్ కో.,
తపాల్ పెట్టె నెం. 1376, మద్రాసు-1.


## "యుక్తి"

రచన: దాసరి పట్టాభి

పూర్వము కళింగదేశాన్ని హేమకేతుడు పాలిస్తున్నప్పుడు, రంగశర్మ అనే ఓ ఆస్థానకవి ఉండేవాడు. అతను ఎటువంటివాణ్ణయినా యుక్తితో ఓడించేసేవాడు గనుక అతన్ని అందఱూ "యుక్తిశర్మ" అనే పిలవటం మొదలెట్టారు.

ఓ రోజు ద్రవిడదేశంనుండి ఓ పండితుడు హేమకేతుని ఆస్థానానికి వచ్చేడు. "యుక్తిశర్మ" ఆవేళ రాలేదు. ఆస్థానకవు లందఱూ ఈక్రొత్తపండితుని దగ్గర ఓడిపోయారు. రాజుగారు "రేపు యుక్తిశర్మకూడా వస్తాడు. అప్పుడు మీ బహుమతివిషయం చూద్దామ"న్నారు. పండితుడు గర్వంతో హాయిగా నిద్రపోయాడా రాత్రి. ఈ విషయము యుక్తిశర్మకి తెలిసింది.

మరునాడు యుక్తిశర్మ ఎవరూ పోల్చని వేషంవేసుకొని ఆస్థానంకొచ్చేడు. తనవెనుక ఓ గుఱ్ఱంపై తనవేషము వేయించి ఓమరుగుజ్జును తీసుకొచ్చాడు. పండితుడా మరుగుజ్జుని చూడఁగానే "అకారం హ్రస్వం" (అకారం పొట్టిది) అన్నాడు గట్టిగా ఆ కవిని హేళనచేద్దామనుకొని. ఇదే అదనుగా "యుక్తిశర్మ", యుక్తిగా "ఆ" కారం హ్రస్వమెలా అవుతుంది. 'ఆ' దీర్ఘము. అకారం హ్రస్వమని మీరేపుస్తకంలో చూపిస్తారో చూపించండి" అన్నాడు. దాంతో పండితుడు హడలెత్తిపోయి, ఎలానో తమాయించుకొని, "నాబసలో ఆ పుస్తకం ఉంది. మీకు తెచ్చి చూపిస్తానుండండి" అంటూ ఒకటే పరుగుతీశాడు, వెనుదిరక్కుండా.

రాజుగారు అతనికిద్దామని తెచ్చిన బహుమతులు "యుక్తిశర్మ" కి దక్కాయి. ★